సాక్షి

అన్నమయ్య జిల్లా

ఆదివారం । 20 । అక్టోబర్ । 2024



వర్షం కారణంగా మ్యాచ్‌లకు ఆటంకం

కడపలో నిర్వహిస్తున్న అండర్‌-14 క్రికెట్ టోర్నమెంట్‌కు వర్షం ఆటంకంగా మారింది. చిత్తూరు, విశాఖపట్నం మ్యాచ్ వర్షం కారణంగా తొలిరోజు రద్దయింది. -8లో



స్త్రీ నిధి సొమ్ము స్వాహాపై విచారణ

స్త్రీ నిధి సొమ్ము స్వాహాపై విచారణ అధికారి, స్త్రీ నిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉదయ్ కుమార్ శనివారం ఎగువగొట్టివీడు గ్రామం గొల్లపల్లెలో విచారణ జరిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.430	రూ.520
రెండోరకం	రూ.320	రూ.420

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 143 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

78 మంది వీఆర్‌ఓల బదిలీ

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో 78 మంది వీఆర్‌ఓలను బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం బదిలీ ఉత్తర్వులు కలెక్టర్ కార్యాలయం నుంచి వెలువడ్డాయి. బదిలీ అయిన వీఆర్‌ఓలు ఆయా గ్రామాలలో బాధ్యతలు చేపట్టాలని కలెక్టర్ ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట: రాజంపేట నారమరాజుపల్లె వద్ద ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతిలో ఖాళీలను భర్తీ చేయడానికి ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నవోదయ విద్యాలయ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ,ప్రభుత్వంచే గుర్తింపబడిన పాఠశాలలో అన్నమయ్య, కడప జిల్లాలో 2024–2026 విద్యాసంవత్సరానికి 8వతరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారాలు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌కు వచ్చేనెల 30 వరకు తుదిగడువుగా నిర్ణయించామన్నారు. ప్రవేశపరీక్ష వచ్చే యేడాది ఫిబ్రవరి 8న ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌వీవోడీఏవైఏ.జీవోవీలో సంప్రదించాలని కోరారు.

రేపు జిల్లాస్థాయి ఖోఖో ఎంపికలు

కడప స్పోర్ట్స్: చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని బయనపల్లె శ్రీవెంకటేశ్వర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈనెల 21వ తేదీ ఉదయం 11 గంటలకు ఉమ్మడి వైఎస్‌ఆర్ కడప (వైఎస్‌ఆర్, అన్నమయ్య) జిల్లాస్థాయి ఖోఖో జూనియర్ విభాగం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డా. కె. రామసుబ్బారెడ్డి, జె. నరేంద్ర తెలిపారు. ఎంపికల్లో పాల్గొనేందుకు 2006 నవంబర్ 21వ తేదీ తర్వాత పుట్టిన వారు అర్హులన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు చిత్తూరు జిల్లా కాణిపాకంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 98497 13690 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

24న బద్వేలులో వైవీయూ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

వైవీయూ: బద్వేలు పట్టణంలోని బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాలలో ఈనెల 24వ తేదీన వైవీయూ అంతర్ కళాశాలల క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి తెలిపారు. పురుషులు, మహిళల విభాగాల్లో బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు తమవెంట కళాశాల ప్రిన్సిపాల్ లేదా ఫిజికల్ డైరెక్టర్ సంతకం చేసిన ఎలిజిబిలిటీ ఫాంలు, అటెస్టెడ్ సర్టిఫికెట్‌లతో హాజరుకావాలని సూచించారు. 2024 జూలై 1వ తేదీ నాటికి 17 సంవత్సరాలు నిండి 25 సంవత్సరాలలోపు ఉన్న క్రీడాకారులు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. పూర్తి వివరాలకు 9000294626, 9705459052 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

23న చలో వైవీయూ

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో అవినీతి, లైంగిక వేధింపుల ఆరోపణలు ఉన్న ఆచార్య కె. కృష్ణారెడ్డిని వీసీగా కొనసాగించడాన్ని నిరసిస్తూ ఈనెల 23వ తేదీన చలో యోగివేమన విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి జి. వలరాజు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి. గంగాసురేష్ తెలిపారు. శనివారం వైవీయూలో వారు మాట్లాడుతూ వీసీగా నియమితులైన ఆచార్యునిపై గతంలో లైంగిక ఆరోపణలు, కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ఉన్న సమయంలో ఏసీబీ ఎంక్వైరీలు వేయడం, ఇలా ఆరోపణలు ఉన్న వ్యక్తిని ఉన్నతమైన వీసీ పదవికి నియమించడం నైతికంగా సరికాదని పేర్కొన్నారు.

న్యాక్ పీర్ టీం చైర్మన్‌గా వైవీయూ ఆచార్యుడు



ఆచార్య బాయినేని శ్రీనివాసులు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (ఎన్.ఎ.ఎ.సి) పీర్ టీం చైర్మన్ గా నియమితులయ్యారు. ఈ బృందం కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో ఉన్న మహాత్మా గాంధీ డిగ్రీ కళాశాలను ఈ నెల 23, 24వ తేదీన సందర్శించనుంది. ఈ బృందానికి సమన్వయకర్తగా డాక్టర్ ఎస్.ఆర్ మోహన్ వ్యవహరించనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆచార్య శ్రీనివాసులు మహారాష్ట్ర లోని మయానిలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలేజీకి న్యాక్ పీర్ టీం మెంబర్ సమన్వయకర్తగా, తమిళనాడులోని శ్రీ రామలింగ స్వాదంబిగల్ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ కామర్స్‌నకు న్యాక్ పీర్ టీం మెంబర్ సమన్వయకర్తగా, మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్ లో ఉన్న గవర్నమెంట్ సంజయ్ గాంధీ స్మారక పీజీ కళాశాలకు టీమ్ మెంబర్ గా వెళ్లి క్రియాశీలకమైన బాధ్యతలను నిర్వర్తించారు.

ఇసుకే బంగారమాయెనా!

- అన్నమయ్య జిల్లాలో రోజురోజుకి పెరుగుతున్న ఇసుక కష్టాలు
- చెయ్యేరులోకి వర్షపు నీరు
- ఇప్పటికే బుడుగుంటపల్లె రీచ్‌లోకి చేరిన వరద నీరు
- ఇటీవల మూడు రీచ్‌లకు అనుమతులిచ్చిన ఇంకా ఇసుక తీత మొదలు కాని వైనం
- ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాలకు ప్రాజెక్టుల్లోకి నీరు
- ఇసుక కోసం వినియోగదారులకు తప్పని తిప్పలు





రాజంపేట రూరల్ పరిధిలోని బుడుగుంటపల్లె ఇసుక రీచ్‌లో ఉన్న వరద నీరు (ఇన్‌సెట్) ఎక్కడికక్కడే ఆగిపోయిన ఇసుకను తరలించే వాహనాలు

సాక్షి రాయచోటి: ప్రజలకు ఇసుక కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి ఇసుక కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఇన్నాళ్లూ ఇసుక రీచ్‌ల ఎంపికలో ప్రభుత్వం కాలయాపన చేయగా.. తాజాగా వరద రూపంలో ఇసుకకు జలగండం ఏర్పడింది.

సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడినా ఇప్పటివరకు కొత్త రీచ్‌లను ఎంపిక చేయకపోవడం, ఉన్న ఒకట్రెండు రీచ్‌లలోనే ఒక కాంట్రాక్టు ద్వారా అందిస్తూ వచ్చారు. దానికి కూడా సవాలక్ష నిబంధనలు పెట్టింది. జిల్లా వ్యాప్తంగా తీసుకెళ్లాలంటే వేలకు వేలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. వారం రోజుల క్రితం ఇసుక రీచ్‌లకు టెండర్లు పిలిచి ఇలా ఎంపిక చేసి ప్రారంభిస్తున్నారో లేదో అంతలోనే వర్షాలు ముంచెత్తడంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. ఇసుక దొరకడమే గగనమైతే వేలకు వేలు ట్రాన్స్‌పోర్ట్ బిల్లులతో వినియోగదారులు అల్లాడిపోతున్నారు. మరోవైపు అధికార పార్టీ నాయకులు మాత్రం అర్ధ రాత్రిళ్లు, తెల్లవారు జామున కంట కనిపించకుండా ఇసుకను చక్కబెట్టేస్తున్నారు.

బుడుగుంటపల్లె ఇసుక రీచ్‌లోకి వరద నీరు

అన్నమయ్య జిల్లాలోని రాజంపేట రూరల్ పరిధిలోని బాలరాజుపల్లె సమీపంలో ఉన్న బుడుగుంటపల్లె ఇసుక రీచ్‌లోకి వరద నీరు చేరింది. మూడు రోజుల క్రితం పింఛా ప్రాజెక్టు పరిధిలోకి నీరు రావడంతో ఇరిగేషన్ అధికారులు దిగువకు 120క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. దీంతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు చెయ్యేరు నది జలమయమైంది. ఇసుక రీచ్ ఉన్న ప్రాంతానికి నీరు చేరడంతో రెండు రోజులుగా ఇసుక కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. అందులోనూ యంత్రాలతో కాకుండా మనుషుల ద్వారా ఇసుక బయటకు తోడుతున్న నేపథ్యంలో ఇసుక పూర్తిస్థాయిలో స్టాక్ పాయింట్‌లో పూర్తి స్థాయిలో నిల్వలు లేదు. ఎప్పటికప్పుడు రీచ్‌లో తోడుతున్న ఇసుక స్టాక్ పాయింట్‌కు రాగానే బుకింగ్ చేస్తున్న వారికి ఇసుకను అందిస్తున్నారు. కొత్త రీచ్‌లు ఇప్పటిప్పుడు ఓపెన్ చేస్తున్నా ఇసుక తీయడానికి సమయం పడుతోంది.

ఎప్పటికి తీరేనో..

వైఎస్సార్‌సీపీ హయాంలో వర్షాకాలం వచ్చిందంటే ముందస్తుగా ఇసుక నిల్వలు చేసేవారు. అయితే ప్రస్తుతం కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చినా ఇసుక రీచ్‌ల ఎంపికకు దాదాపు మూడు నెలల సమయం పట్టింది. ఆగస్టులో జిల్లా అంతటికి కలికి ఒకే ఒక్క ఇసుక స్టాక్ పాయింట్ ఉన్నప్పటికి పూర్తి స్థాయిలో వినియోగదారులకు ఇసుకను అందించడం కష్టంగా మారింది. ప్రస్తుతం ఎక్కడ చూసినా వర్షాలు పడుతుండటంతోపాటు వరద నీరు వచ్చి నదులలో చేరుతోంది. రెండు రోజులుగా నీరు చేరడంతో ఇసుక వినియోగదారులకు కష్టాలు తప్పడం లేదు. దీంతో ఇసుక రీచ్‌ల నుండి బయటకు తీయడం గగనంగా మారుతోంది.

అన్నమయ్య ప్రాజెక్టులో వరదనీటి ప్రవాహం

రాజంపేట టౌన్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని అన్నమయ్య ప్రాజెక్టులో వరదనీటి ప్రవాహం కొనసాగుతోంది. శనివారం ప్రాజెక్టు ద్వారా 840 క్యూసెక్కుల నీరు దిగువ ప్రాంతానికి సాగింది. రాజంపేట పట్టణానికి అన్నమయ్య ప్రాజెక్టు ద్వారానే నీటి సరఫరా జరిగేది. ప్రాజెక్టు కొట్టుకు పోయిన వెంటనే మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి ప్రాజెక్టులో ఫిల్టర్లు వేయించి నీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చేశారు. గత ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భజలాలు అడుగంటి పోవడంతో అదనంగా ఫిల్టర్లు వేయాల్సివచ్చింది. ప్రస్తుతం ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టు గుండా దిగువ ప్రాంతానికి ఓమోస్తారుగా నీటి ప్రవాహం ఉండటంతో భూగర్భజలాలు గణనీయంగా పెరగనున్నాయి. రాబోవు రోజుల్లో భారీవర్షాలు కురిసి మండలంలోని చెరువులు నిండితే మరో రెండేళ్లపాటు ప్రజలకు తాగునీటి, రైతులకు సాగునీటి కష్టాలు తప్పుతాయి.



అన్నమయ్య ప్రాజెక్టు వైపు పరుగులు పెడుతున్న వరదనీరు

టీడీపీ కడప అధ్యక్షుడిపై హత్యాయత్నం

- తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగుల దాడి
- తలపై బలమైన గాయాలు, వీపుపై కట్టెల దాడి గుర్తులు



నిందితుల దాడిలో గాయపడిన శివకొండారెడ్డి

కడప ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రమైన కడపలో తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు శివ కొండారెడ్డిపై శని వారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేశారు. పాల కోసమని కడపలోని మానస కళ్యాణ మండలం వద్ద ఉన్న షాపు దగ్గరకు వెళుతున్న సమయంలో ఇద్దరు గుర్తు తెలియని దుండగులు స్కూటర్‌పై వచ్చి ఆయనపై కట్టెలతో దాడి చేసి గాయపరిచారు. దీంతో శివ కొండారెడ్డి తలకు బలమైన గాయం కాగా, వీపుపైన కట్టెలతో దాడి చేసిన గుర్తులు పడ్డాయి. స్థానికులు బాధితుడిని వైద్య చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. శివకొండారెడ్డి ఫిర్యాదు మేరకు చిన్నచౌక్ సీఐ తేజమూర్తి ఆధ్వర్యంలో ఎస్‌ఐలు రాజరాజేశ్వర్‌రెడ్డి, రవికుమార్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. గాయాలై రిమ్స్‌లో చికిత్స పొందుతున్న శివకొండారెడ్డిని టీడీపీ కడప నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి అమీర్‌బాబుతో పాటు పలువురు నాయకులు పరామర్శించారు.

నింధితులను కఠినంగా శిక్షించాలి

శివకొండారెడ్డిపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని అమీర్‌బాబుతో పాటు శివకొండారెడ్డి సోదరులు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలిసి ఫిర్యాదు చేశారు.

దుష్ప్రచారం మానండి

- టీడీపీ సోషల్ మీడియా వింత చేష్టలు
- సీఎం చంద్రబాబు తీరుపై ధ్వజమెత్తిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి



సాక్షి ప్రతినిధి, కడప: సీఎం చంద్రబాబు, టీడీపీ ఓ పథకం ప్రకారం కుట్ర పన్నుతోందని.. లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లు వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆ పార్టీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి అన్నారు. కడపలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలను దూరం చేసేందుకు టీడీపీ సోషల్ మీడియా విషప్రచారానికి దిగుతోందన్నారు. వైఎస్ జగన్ వల్ల కార్యకర్తలు నష్టపోయారని, ఎవరూ ఇక ఆయన్ను నమ్మవద్దంటూ ఓ పోస్టును టీడీపీ వారే సృష్టించి విష ప్రచారం చేస్తున్నారన్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో చెప్పిన ప్రతి హామీని అమలు చేసి పార్టీ కార్యకర్తలను కాలర్ ఎగురేసుకుని తిరిగే లా తమ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేశారని వివరించారు.

చంద్రబాబు సిద్ధహస్తుడు

దుష్ప్రచారం చేయడంలో సీఎం చంద్రబాబు సిద్ధహస్తుడని, మొన్న హిందువులు వైఎస్సార్‌సీపీకి దూరం చేయాలనే కుట్ర పన్నారని రవీంద్రనాథరెడ్డి తెలిపారు. నిస్సిగ్గుగా తిరుమల లడ్డూ ప్రసాదంపై ఆరోపణలు అంటగట్టారన్నారు. అవన్నీ చంద్రబాబు దుష్ప్రచారాలేనని తేటతెల్లమైందని, నిన్న టీడీపీ ఎమ్మెల్యేల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ లాగా దోపిడీ చేస్తే సహించమని చెప్పడం మరీ విడ్డూరంగా ఉందన్నారు. వాస్తవంగా బాబు మాటలకు, చేష్టల కు పొంతన ఉండదన్నారు. ఇసుక, మద్యం షాపుల్లో టీడీపీ దోపిడీకి అనుగుణంగా ప్రభుత్వ చర్యలున్నాయన్నా రు. నిల్వ ఉన్న 40లక్షల టన్నుల ఇసుక టీడీపీ నేతల దోపిడీ గురైందని, మద్యం షాపులను స్వాధీనం చేసుకుంటున్నారని, ఇవన్నీ తెలిసి కూడా సీఎం మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

అదృశ్యమైన మేకల కాపరి ఆచూకీ లభ్యం

క్షేమంగా ఇంటికి తీసుకొచ్చిన గ్రామస్తులు

అట్లూరు: గత సోమవారం అదృశ్యమైన మేకల కాపరి సొంటా గంగిరెడ్డి శనివారం మధ్యాహ్నం అటవీ ప్రాంతంలో గ్రామస్తులకు తటస్థ పడడంతో క్షేమంగా ఇంటికి తీసుకొచ్చారు. ఈనెల 14వ తేదీన సొంటా గంగిరెడ్డి (60) అటవీ ప్రాంతానికి మేకలు తోలుకుని వెళ్లి తిరిగి రాలేదు. మంగళవారం రాత్రికి మేకలు మాత్రం ఇంటికి వచ్చాయి కానీ గంగిరెడ్డి మాత్రం ఇంటికి రాలేదు. రాత్రనక పగలనక 60 నుంచి 70 మంది ప్రతిరోజూ గాలించారు. డ్రోన్ కెమెరాలతో గాలించారు. ప్రయోజనం లేదు.. ఆశలు వదులుకున్నారు. అయినా చివరి ప్రయత్నంగా ట్రాక్టర్లతో గ్రామస్తులు, బంధువులు గాలింపు ముమ్మరం చేశారు. ఎట్టకేలకు గుబ్బకోన అటవీ ప్రాంతంలో సొంటా గంగిరెడ్డి నీరసంతో కనించడంతో హమ్మయ్యా.. దొరికాడు అని అక్కడ నుంచే సమాచారం అందించి ఇంటికి తీసుకొచ్చారు. కొంత విశ్రాంతి తీసుకొన్న తరువాత గంగిరెడ్డిని విచారించగా గడచిన ఆరు రోజులు వర్షాలు కురుస్తున్నాయి.. ఎలా ఇంటికి రావాలో తెలియదు. తూర్పు ఏదో పడమర ఏదో తెలియక ఇంటికి రాను దోవ తెలియక తిక మక పడి తిరుగుతూ ఉన్నానని సమాధానం తెలిపాడు. ఏదిఏమైనా ఇన్ని రోజులకు గంగిరెడ్డి ఆచూకీ లభించడంతో బంధువులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇంటికి తీసుకొచ్చి వైద్యపరీక్షలు చేయించగా 200 బీపీ ఉందని బంధువులు తెలిపారు.



అటవీ ప్రాంతంలో నీరసంతో దొరికిన మేకల కాపరి సొంటా గంగిరెడ్డి



అటవీ ప్రాంతంలో గంగిరెడ్డి ఆచూకీ కోసం గాలిస్తున్న గ్రామస్తులు, బంధువులు (ఫైల్)

తాగు నీటితోనే వారం రోజులు గడిపాను..

సోమవారం మేకలు తోలుకుని వెళ్లినాను.. వర్షం ఎక్కువగా ఉంది. ఇంటికి వచ్చేందుకు ఎలా వెళితే ఊరు వస్తుంది అనేది దిక్కు తోచలేదు. వర్షం వస్తే చెట్టుకిందకు వెళతా ఉన్నా వర్షం లేనప్పుడు మేకలు ఎలా వెళ్లాయి, అని వెతుకుతున్నా, ఇంటికి వెళ్లేందుకు దోవ తెలియలేదు. నాకు చలి అనిపించలేదు ఆకలి వేస్తే నీళ్లు తాగడం ఎక్కడ నిద్రవస్తే అక్కడ ఉన్న చెట్టుకింద నిదుర పోవడం తప్ప ఇంక నాకు ఏమీ తెలియలేదు. అప్పుడప్పుడు నేను ఎక్కడ ఉన్నానో నాకే తెలియదు. ఈరోజు మా వాళ్లు అందరూ నాదగ్గరకు వచ్చారు. ఇంటికి తీసుకొచ్చారు అంటూ సొంటా గంగిరెడ్డి సాక్షితో తెలిపారు.

రామా.. అన్యాయం కనుమా!

- ప్లాస్టింగ్ వేసిన కొన్ని రోజులకే గోడలపై నెర్రలు
- నాణ్యతలేని తువ్వ ఇసుక వాడడమే కారణం అంటున్న పరిశీలకులు



పునర్నిర్మాణ పనుల్లో భాగంగా బండలను కట్ చేస్తున్న దృశ్యం



నెర్రెలు చీలిన ప్లాస్టింగ్



ఆలయ పరిసరాల్లో నిర్మాణ పనుల కోసం ఉంచిన తువ్వ ఇసుక

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట రామయ్య ఆలయంలో జరుగుతున్న పునర్నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయా..? పురావస్తు శాఖ పర్యవేక్షణ కొరవడిందా..? అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. గోడలపై ఏర్పడుతున్న పగుళ్లే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. ఎంతో పురాతనమైన, చారిత్రక ప్రసిద్ధి కలిగిన దేవాలయం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామ స్వామి ఆలయం. దేశంలోనే రెండవ అయోధ్యగా పేరుగాంచింది. సాక్షాత్తు ఆ అయోధ్య రాముడే నడయాడిన పుణ్యభూమిగా ఒంటిమిట్ట విలసిల్లుతోంది. అలాంటి ఈ పుణ్యక్షేత్రంలో ఇటీవల కొన్ని ప్రదేశాలు, రూపాలు శిథిలావస్థకు చేరుతుండడంతో పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రెండు నెలల నుంచి పురావస్తు శాఖ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి.

నాణ్యత లేని తువ్వ ఇసుకతో పునర్నిర్మాణ పనులు....

పునర్నిర్మాణ పనుల్లో భాగంగా కొన్ని రోజులుగా ఆలయ పరివార ప్రహరీ పైన ప్లాస్టింగ్ పనులు జరుగుతున్నాయి. కొంత మేర ప్లాస్టింగ్ పనులు పూర్తి అయ్యాయి. ఆ పూర్తి అయిన ప్లాస్టింగ్ కొన్ని రోజులకే పగుళ్లు ఏర్పడుతుండటం నిర్మాణ పనుల్లో నాణ్యత లోపాన్ని చూపిస్తోంది. ఆ నాణ్యత లోపం దేని వల్ల జరిగిందని ఆరా తీయగా నిర్మాణ పనుల్లో తువ్వ ఇసుక వాడుతున్నారని పరిశీలకులు, భక్తులు ఆరోపిస్తున్నారు. ఆలయాలు అంటే తరాలు, యుగాలు మారిన చెక్కుచెదరకుండా ఉండేలా అప్పటి కళాకారులు, నిర్మాణకారులు తీర్చిదిద్దేవారు. నేడు ఆలయాల్లో చేస్తున్న తాత్కాలిక నిర్మాణ పనుల్లో సైతం నాణ్యత లోపిస్తే ఎలా అని భక్తులు వాపోతున్నారు.

పురావస్తు శాఖ నిర్లక్ష్యం ఉందా?

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయం పునర్నిర్మాణ పనులు పురావస్తు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. పురావస్తు శాఖ సరైన పర్యవేక్షణ లేకే ఇలా జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. పునర్నిర్మాణ పనులను పరిశీలించేందుకూ వెళ్తున్నవారిని నిరాకరిస్తుండడం గమనార్హం. ఇప్పటికైనా పురావస్తు శాఖ అధికారులు మేలుకొని పునర్నిర్మాణ పునులను నాణ్యతగా చేయించాలని భక్తులు, ప్రజలు కోరుతున్నారు.

నాణ్యమైన ఇసుకను వాడమని చెప్పాం

ఒంటిమిట్ట రామాలయంలో జరుగుతున్న పునర్నిర్మాణ పనులకు తువ్వ ఇసుక వాడుతున్నారని కొంతమంది ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే గుత్తేదారుడికి నిర్మాణం పనుల వద్ద ఉన్న తువ్వ ఇసుకను తొలగించి నాణ్యమైన ఇసుకను వాడమని ఆదేశించాం. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదు.

– బాలకృష్ణారెడ్డి, కడప జిల్లా ఇంచార్జ్ పురావస్తుశాఖ అధికారి

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు గడువు పెంపు

రాయచోటి టౌన్ : ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు ఈ నెల 31వ తేది వరకు గడువు పెంచినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి, ఓపెన్ స్కూల్స్ జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీనవాసరాజులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 25 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. రూ.200ల అపరాధ రుసుంతో ఈ నెల 26 నుంచి 29 వరకు, రూ.500ల అపరాధ రుసుంతో ఈ నెల 31 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని వివరించారు.

వైఎస్‌ఆర్ జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు



కడప అగ్రికల్చర్: జిల్లాలో వర్షాలు కొనసాగుతూనే ఉన్నాయి. శుక్రవారం తెల్లవారు జాము నుంచి శనివారం ఉదయం వరకు జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. పెండ్లిమర్రిలో అత్యధికంగా 50.2 ఎంఎం వర్షం కురిసింది. చాపాడులో 15 ఎంఎం, కొండాపురంలో 13.2, కమలాపురంలో 11.2, తొండూరులో10.6 , గోపవరంలో 10, సింహాద్రిపురంలో 8.4, పులివెందుల్లో 8.2, వీఎన్‌పల్లిలో 6.8, జమ్మలమడుగులో 6.4, ముద్దనూరు, వల్లూరులో 5.2, చెన్నూరులో 4.6 , కాశినాయన, బద్వేల్ 4.4, కడప 4.2, ఖాజీపేట 3.8, మైలవరం 3.4, బి.మఠం, వేములలో 3, వేంపల్లిలో 2.4, మైదుకూరులో 2, బికోడూరులో 1.8, రాజుపాలెంలో 1.6, సికెదిన్నెలో 1.2, లింగాల, చక్రాయపేట, అట్లూరులలో 1 ఎంఎం చొప్పున వర్షపాతం నమోదయింది.

క్లుప్తంగా

విద్యార్థికి పాము కాటు

మదనపల్లె : తరగతి గదిలో విద్యార్థి పాము కాటుకు గురైన సంఘటన శనివారం ములకలచెరువు మండలంలో జరిగింది. పెద్దపాళ్యం హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న రియాజ్ (12) తరగతి గదిలో కూర్చుని కిటికీ తలుపులు తెరవగా, అక్కడే ఉన్న పాము చేతిపై కాటువేసింది. దీంతో విద్యార్థి అస్వస్థతకు గురికాగా, పాఠశాల ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు విద్యార్థిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

బైకు అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

మదనపల్లె : బైకు అదుపుతప్పి వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం పెద్దమండ్యం మండలంలో జరిగింది. మదనపల్లె పట్టణం ఈశ్వరమ్మ కాలనీకి చెందిన మణికంఠ(35) వ్యక్తిగత పనులపై గాలివీడు రోడ్డులో వెళుతుండగా, చెరువుకట్ట సమీపంలో కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

చీటింగ్ కేసులో వ్యక్తి అరెస్టు

కడప ఎడ్యుకేషన్ : ప్రేమ, పెళ్లి పేరుతో యువతిని మోసం చేసిన కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాలుకా పోలీసులు తెలిపారు. కడపకు చెందిన చిన్నబోయిన రాము కడప తాలూకా పరిధికి చెందిన యువతిని పెళ్లి పేరుతో మోసం చేశాడు. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనిపై చీటింగ్ కేసు నమోదు చేసి శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

పెట్రోల్.. నో రూల్!

- ఇష్టానుసారంగా పెట్రోల్ బంకుల నిర్వహణ
- కొరవడిన కనీస వసతులు
- నీరుతో కలిపిన పెట్రోల్ విక్రయం
- నిబంధనలకు తూట్లు
- బంకుల వైపు కన్నెత్తి చూడని అధికారులు



రాజంపేట రూరల్ : జిల్లా పరిధిలో పెట్రోల్ బంకుల నిర్వహణ బంకు యజమానుల ఇష్టారాజ్యంగా జరుగుతోందని వాహన చోదకులు మండిపడుతున్నారు. వీరి దోపిడీని అదుపు చేసే యంత్రాంగమే లేదా అనే సందేహం ప్రజలకు వస్తోంది. జిల్లా వ్యాప్తంగా 116 పెట్రోలు బంకులు వినియోగంలో ఉన్నాయి. వాహనాలకు ఇంధనం నింపే ఈ బంకుల్లో కనీస మౌలిక సదుపాయాలు ఇసుమంతైనా కనిపించవు. ఒక వైపు పెట్రోలు ధరలు మండిపోతున్నప్పటికి కొలతల విషయంలో అధికారులు మాత్రం మొక్కుబడిగా తనిఖీలు చేస్తున్నారనే ఆరోపణలు అధికంగా ఉన్నాయి. వాస్తవానికి వాహన చోదకులకు కొన్ని సదుపాయాలు, ఉచిత సేవలు అందిచాల్సిన బాధ్యత బంకు యజమానులపై ఉంది. ఒకటి, రెండు బంకుల్లో మినహా ఎక్కడా ఇలాంటి సదుపాయాల జాడ కనిపించడంలేదు.

నీరు కలిపిన పెట్రోల్ విక్రయం

రెండు రోజుల క్రితం రైల్వేకోడూరులోని ఓ పెట్రోల్ బంకులో నీరు కలిపిన పెట్రోల్ విక్రయించారు. ఇదే విషయంపై వినియోగదారులు గోల పెట్టినా ఏ అధికారి పట్టించుకోలేదు. పెట్రోల్ నింపే విధానాన్ని వీడియో తీసి చూపించినా ఏ అధికారి ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. అసలు పెట్రోల్ బంకులు ఏ శాఖ కిందికి వస్తాయో తెలియక ప్రజలు తికమక పడుతున్నారు.

బంకుల వద్ద కల్పించాల్సిన కనీస వసతులు ఇవే

ఇంధనం కోసం బంకులకు వచ్చే వాహనదారులకు తాగునీరు, మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలి. వాహనాలకు ఉచితంగా గాలి పట్టేలా యంత్రాలు ఉండాలి. వాహనాల్లో పెట్రోలు నింపే సమయంలో పెట్రోలు పడితే సిబ్బంది తప్పని సరిగా శుభ్రం చేయాలి. పెట్రోలు కొట్టే సిబ్బంది కూడా సెల్‌ఫోన్‌లో మాట్లాడరాదు. అధికశాతం బంకుల్లో పనిచేసే సిబ్బందికి మాత్రమే ఉపయోగపడేలా కార్యాలయ గదుల్లో తాగునీరు ఏర్పాటు చేసుకుంటున్నారు. కొన్ని బంకుల్లో మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. తప్పని సరిగా మహిళలకు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఏర్పాటు చేసి ఉంచాలి. ఏ బంకులోను ఉచితంగా గాలి పట్టే సదుపాయం లేదు. కొన్ని చోట్ల మొక్కుబడిగా గాలి మిషన్లు ఉన్నా గాలి పట్టే వారు ఉండటం లేదు. ఇంధన నాణ్యత, ధర, బంకు వేళల్లో నిర్వాహకుడి ఫోన్ నంబర్, అత్యవసర సేవ వివరాలను బహిరంగంగా ప్రదర్శించాలి. కాని ఏ బంకులోను ఈ సౌకర్యాలు కనిపించడంలేదు. కొన్ని బంకుల్లో షెల్టర్లు కూడా లేకపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

బంకుల వైపు చూడని అధికారులు

ఇంధన బంకులను పర్యవేక్షించాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదని వినియోగదారులు వాపోతున్నారు. బంకులపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో నిర్వాహకులు వారికి ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ధరలు పెరిగినప్పుడు వెంటనే పెంచే నిర్వాహకులు ధరలు తగ్గినప్పుడు మాత్రం దాదాపు ఒక రోజంతా ధరలు తగ్గించకపోవడం అంటే ఇది ముమ్మాటికి ప్రజలను దోచుకోవడమేనని మేధావులు సైతం అభిప్రాయపడుతున్నారు.

మౌలిక వసతులు తప్పని సరిగా ఉండాలి



పెట్రోల్ బంకుల్లో ఉచితంగా గాలి పట్టడం లేదు. మరుగుదొడ్లు మచ్చుకైనా కనిపించడం లేదు. తాగునీటిని ఏర్పాటు చేయడంతో పాటు కనీస వసతులు కల్పించడంలో అధికారులు చొరవ చూపాలి. – వై.రవీంద్రనాయుడు, రైతు, పెనగలూరు మండలం.

కిట్లు అందుబాటులో ఉంచాలి



పెట్రోల్ బంకుల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, గాలి నింపే యంత్రాలు ఉంచితే బాగుంటుంది. అదేవిధంగా ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలి.
– సి. సురేష్ రాజు, కాంట్రాక్టర్, పుల్లంపేట మండలం

భక్తులకు సౌలభ్యంగా లేదు



ఉమ్మడి జిల్లాల మీదుగా కొన్ని వేల మంది భక్తులు తిరుమలకు వెళ్లే ఈ దారిలో పెట్రోల్ బంకుల మీద ఆధారపడుతుంటారు. అలాంటి వారికి బంకుల యజమానులు కనీస వసతులు ఏర్పాటు చేయక పోవటం దారుణం.
– ఎం.నాగబాలాజీరావు, భక్తుడు, రాజంపేట.

పెట్రోల్‌లో నీళ్లు నింపుతున్నారు



రైల్వేకోడూరులోని ఓ పెట్రోల్ బంకులో నీళ్లు కలిసి ఉన్న పెట్రోల్‌ను వినియోగదారులకు నింపారు. ఇదే విషయంపై వాహనదారులు గగ్గోలు పెట్టినా వారు పట్టించుకోకుండా పెట్రోల్ నింపుతూనే ఉన్నారు.
– పి.మణి, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు,రైల్వేకోడూరు.

హుండీ ద్వారా రూ.7 లక్షలు ఆదాయం



రెడ్డెమ్మకొండ ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లెలో వెలిసిన శ్రీ రెడ్డెమ్మకొండ ఆలయానికి హుండీ ద్వారా రూ.7,00,175 ఆదాయం సమకూరింది. శనివారం స్థానిక ఆలయంలో మదనపల్లె దేవదాయశాఖ ఇన్స్‌పెక్టర్ శశికుమార్ ఆధ్వర్యంలో హుండీ ఆదాయం లెక్కించారు. మూడు నెలల కాలానికి సంబంధించి మొత్తం రూ.7,00,175, 16 గ్రాముల బంగారు ఆభరణాలు, 169 గ్రాముల వెండి కానుకలు వచ్చినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని వాల్మీకిపురం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో జమ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ మంజుల, ఆలయ అర్చకులు, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

చెన్నూరు(వల్లూరు) : చెన్నూరులోని కొత్త రోడ్డులో గల మెడికల్ షాపు, కూల్ డ్రింక్ షాపుల్లో 5 రోజుల క్రితం జరిగిన చోరీ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను శనివారం అరెస్టు చేసినట్లు సీఐ పురుషోత్తం రాజు తెలిపారు. సుమారు రూ.60 వేలకు పైగా విలువ చేసే వస్తువులు చోరీకి గురైనట్లు షాపుల యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు. ఈ మేరకు కడప పట్టణానికి చెందిన సయ్యద్ మహమ్మద్ యూసుఫ్, షేక్ ఫర్హాన్‌లను శాటిలైట్ సిటీ సమీపంలో అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2500 నగదును, రెండు సెల్ ఫోన్‌లు, ఒక స్మార్ట్ వాచ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిని కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెండు సంవత్సరాల ఇంటర్మీడియట్ మరియు డైరెక్ట్ 10th Class Aposs ద్వారా కేవలం 5 నెలలో అయిపోతుంది. ఆచార్య నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా B.A, B.Com, B.Sc, B.Li.Sc, M.A, M.Com, MBA, MCA, MSC, కోర్సులు కలవు. One Sitting Degree Availbale లోకేష్ యాదవ్ ఫోన్: 9963095103

■ ఆచార్య నాగార్జున యూనివర్శిటీ, Degree, P.G. All Groups అడ్మిషన్లు జరుగుచున్నవి Authoriased Stduy & Exam Center B.Tech Detained & Failed students join one sitting save your gap years Taminadu Universities, Sugan edcuational Academy, Y.Junction, Kadapa, Cont: 9949393809, 7674090494

REAL ESTATE

FLAT FOR SALE

■ కడప, మల్లికార్జున నగర్, Opp. విజయదుర్గ టెంపుల్, విజయదుర్గ అపార్ట్‌మెంట్, బ్లాక్-బి, Flat 102, E/F, 1వ అంతస్తు, 2BHK,1100Sft,35L, Ph: 9441037914

LAND FOR SALE

■ ముదిగుబ్బ (Satya Sai Dist) బైపాస్ రోడ్డు నందు (పులివెందుల-పుట్టపర్తి రోడ్) ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా 65 సెంట్లు మామిడి తోట అమ్మబడును. Ph: 9440397576

PLOT FOR SALE

■ 12 సెంట్లు ప్లాటు అమ్మకానికి కలదు. రాయచోటి బైపాస్ రోడ్డు ప్రక్కన, క్లియర్ టైటిల్. సంప్రదించండి. 9121768777

SERIVCES

OLD AGE HOME

■ హైదరాబాద్‌లోని వృద్ధాశ్రమంలో పని చేయుటకు మనుషులు కావలెను. జీతము 12000 - 15000 + ఉచిత వసతి + భోజనము. ఫోన్: 9347556162, 8309815249

CHANGE OF NAME

■ I, 14828240L, Rank Have/MT Subhan Shaik, I, have changed my wife name from (Old Name) SK Parveen, (New Name) Shaik Praveen Affidavit No.03AA 762961 Date: 15/10/2024

■ I MOHAMMAD KHASIM SIRAJUDDIN (OLD NAME) D.NO.4/73-B, USMAN NAGAR RAJAMPET, ANNAMAYYA DIST, AP. HERE CHANGE MY NAME AS SHAIK SIRAJUDDIN (NEW NAME) S/O LATE SHAIK MOHAMMAD KHASIM. HENECEFORTH I MAY BE CALLED AS SHAIK SIRAJUDDIN

HEALTH CARE

NEUROLOGIST

■ డా॥M.సుధాకర్‌రావు M.D(Gold Medalist) D.M. (Neurology) అన్ని రకముల మెదడు, వెన్నుపూస,నరముల జబ్బులు చూడబడును, సుధాకర్ న్యూరో క్యూర్, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి,0877-2250600,9949916060.

RHEUMATOLOGY

■ డా.పి.దామోదరం,MD,DM(NIMS)రుమటాలజిస్ట్-కీళ్ళవాతం నిపుణులు,శుభోదయ రుమటాలజి సెంటర్,Opp. SBH Bank, జయనగర్, తిరుపతి,9391344644, 9704582045.

WANTED

■ కంప్యూటర్ బేసిక్స్, MS ఆఫీస్, టాలీ, DTP నేర్పించుటకు అనుభవం కలిగిన మహిళా ఫ్యాకల్టీ కావలెను. అనుభవం కలిగిన మహిళా బ్యూటీషియన్ మరియు ట్రైనర్ కావలెను. అర్చి ఉమెన్స్ సెంటర్, మద్రాస్ రోడ్, కడప. ✆ 9059057641, 7893386712

■ కడప నగరంలోని ఆర్చి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు హిందీ, కంప్యూటర్ టీచర్స్ కావలెను. ✆ 8074717196, 8106123469

■ రాఘవ ఆటో ఫైనాన్స్ నందు పని చేయుటకు బిజినెస్ ఎగ్జిక్యూటివ్ కావలెను. అర్హత: ఇంటర్/డిగ్రీ, జీతం: 14-16 వేలు, వ: 22-32 సం॥లు ఏరియాలు: కడప, బద్వేల్, రాయచోటి, వేంపల్లె, ప్రొద్దుటూరు, అగ్రస్ శంకరాపురం, కడప, ✆ 76808 80291/527

■ కడప టౌన్‌లోని GMR స్కూల్‌లో పని చేయుటకు అనుభవజ్ఞులైన ప్రీ-ప్రైమరీ, ప్రైమరీ (1 to 5) మరియు హైస్కూల్ (6 to 10) టీచర్లు (అన్ని సబ్జెక్టులకు), హాస్టల్ వార్డెన్‌లు మరియు అడ్మిషన్స్ చేయుటకు PROలు కావలెను. ✆ 9900041111, 7382183100

■ ప్రముఖ MNC కంపెనీలో లీడర్స్ కావలెను. M/F, విద్యార్హత 10th ✆ 8790026351

■ కార్పొరేట్ బ్యాంక్ లందు పనిచేయుటకు Assitant Manager, BDM, Cashier, Attendersకావలెను.జీ: 17000-30,000. # 88979 09097, 9059054439.

■ ప్రభుత్వ సంస్థలో Out Sourcingపద్ధతిన పనికి కంప్యూటర్ ఆపరేటర్లు, ఒకేషనల్ టీచర్లు, క్లర్క్, జూనియర్ అసిస్టెంట్,అటెండర్,సెక్యూరిటీగార్డ్స్, హౌస్‌కీపింగ్‌స్టాఫ్ కావలెను. 9848771117, 88979 09097.

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692

■ కడప జిల్లా కమలాపురం మండలంలోని ప్రముఖ సెక్యూరిటీ సంస్థ నందు పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్వైజర్స్ కావలెను. జీతం: 14000 to 17000వరకు. 9885341366

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15 వేలు - 40 వేలు, ఫ్రీ రూం+భోజనం. HYD. 7995984445

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 20K. Ph: 8977639662, 8977639663

■ షిరిడీ సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు, వార్డ్ బాయ్స్, కాంపౌండర్స్, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Ph: 9391036931, 9246585901

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు కావలెను. సంప్ర॥ 9391912949, 04040123376

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఇద్దరు అంతర్ జిల్లా దొంగల అరెస్టు

86.5 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం



పోలీసుల అదుపులో చోరీ కేసులో నిందితులు

రాయచోటి టౌన్ : రాయచోటి అర్బన్ పోలీసులు ఇద్దరు అంతర్ జిల్లా దొంగలను అరెస్టు చేసి వారివద్ద నుంచి 86.5 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శనివారం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో రాయచోటి డీఎస్పీ ఎం.టీ. కృష్ణ మోహన్ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. జూన్ 30వ తేదీ రాయచోటి పట్టణంలోని లక్ష్మీపురంలో రెండు ఇళ్లలో దొంగలు బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. దీనిపై కేసు నమోదు చేసిన అర్బన్ సీఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం రాయచోటి-గాలివీడు రింగ్ రోడ్డు వద్ద ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులు నెల్లూరు జిల్లా కావలి పట్టణం మానస హాల్ సమీపంలోని నండిపల్లె గోపి, అదే జిల్లా గుడిపిల్లపాడు లక్ష్మీగణపతి వీధికి చెందిన లింగుటేరి రాంబాబుగా గుర్తించారు. వీరి నుంచి 14 గ్రాముల బరువు ఉన్న రెండు చైన్లు, 6 గ్రాములు ఉన్న కడియం, 27.750 గ్రాములు బరువు ఉన్న నల్లపూసల దండ, 38,750 గ్రాములు ఉన్న నాలుగు బంగారు గాజులు మొత్తం 86.500 గ్రాముల బరువు ఉన్న బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరూ గతంలో పలు పోలీస్ స్టేషన్లలో 12 కేసుల్లో నిందితులుగా ఉన్నారని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలిపారు. నిందితులను అరెస్టు చేసేందుకు కృషి చేసిన అర్బన్ సీఐ చంద్రశేఖర్‌తో పాటు అర్బన్ ఎస్‌ఐలు నరసింహారెడ్డి, అర్బుల్ జహీర్, సిబ్బంది రామచంద్ర, బర్కతుల్లా, మహేంద్ర నాయుడు, పెంచలయ్య, మహేంద్రలను ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అభినందించినట్లు తెలిపారు.

స్త్రీ నిధి సొమ్ము స్వాహాపై విచారణ

- రూ.10 లక్షలు బకాయిలపై ఆరా
- స్త్రీ నిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉదయ్ కుమార్



స్త్రీ నిధి సొమ్ము స్వాహాపై విచారణ చేస్తున్న అధికారులు

గాలివీడు : స్త్రీ నిధి సొమ్ము స్వాహాపై విచారణ అధికారి, స్త్రీ నిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉదయ్ కుమార్ శనివారం ఎగువగొట్టివీడు గ్రామం గొల్లపల్లెలో విచారణ జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాలివీడు మండలంలో మొత్తం రూ.10లక్షల వరకు బకాయిలు ఉండగా అందులో అత్యధికంగా గొట్టివీడు గ్రామంలోని గొల్లపల్లెలో స్త్రీ నిధి సొమ్ము రూ.4.15 లక్షల బకాయిలు ఉన్నాయన్నారు. ఇదే విషయమై మహిళా సంఘాల సభ్యులను విచారించగా ఇప్పటికే చాలా వరకు బకాయిలు చెల్లించామని, అయినప్పటికీ ఎక్కువ మొత్తంలో అప్పు చూపిస్తున్నట్లుగా ఆరోపిస్తున్నారన్నారు. అయితే అవి బకాయిలా? లేక వెలుగు సిబ్బంది చేతివాటంతో నిలిచిపోయిన రుణమా? అనే విషయం క్షేత్రస్థాయిలో రశీదులు, బుక్కులు క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉందన్నారు. మండలంలో గుండ్లచెరువు రూ.80,900, సీసీ పల్లె రూ.65వేలు, తూముకుంట రూ.29,500, అరవీడు రూ.32,000 బకాయిలు ఉన్నాయన్నారు. శనివారం జరిగిన విచారణలో రూ.1,20,000 రికవరీ కాగా అందులో గుండ్లచెరువు నుంచి రూ.30వేలు, నూలివీడు రూ.75వేలు, పూలుకుంట రూ.15వేలు ఉన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్ మౌనిక, లీగల్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ఏపీఎం పెద్ద రెడ్డయ్య, సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు. కాగా గాలివీడు మండలం ఎగవగొట్టివీడు గ్రామంలో స్త్రీ నిధి నుంచి తీసుకున్న రుణం తిరిగి చెల్లించే విషయంలో రూ.3.48 లక్షలు గోల్‌మాల్ అవ్వడంపై యానిమేటర్ సిద్దయ్య, సీసీ రాజగోపాల్ వివరణ ఇచ్చేందుకు శనివారం పీడీ కార్యాలయానికి వెళ్లినట్లు సమాచారం. అంతేగాక ఆరవీడు కూర్మయ్యగారిపల్లెలో స్త్రీ నిధి చేతివేటంపై యానిమేటర్ రెడ్డప్ప, సీసీ సుబ్బమ్మ, గోపనపల్లె సీసీ జయరాం, రైతు మిత్ర సుధాకర్‌రెడ్డిలు పీడీ ముందు వివరణ ఇచ్చేందుకు వెళ్లిన విషయం బయటకు పొక్కకుండా గోప్యంగా ఉంచడం కొసమెరుపు.

వర్షం కారణంగా మ్యాచ్‌లకు ఆటంకం

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-14 క్రికెట్ టోర్నమెంట్‌కు వర్షం ఆటంకంగా మారింది. కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో శనివారం నిర్వహించాల్సిన చిత్తూరు, విశాఖపట్నం మ్యాచ్ వర్షం కారణంగా తొలిరోజు రద్దయింది. వైఎస్‌ఆర్‌ఆర్-ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కర్నూలు, పశ్చిమగోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమగోదావరి జట్టు 76.1 ఓవర్లలో 98 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని కె.పి.నారాయణ 29, శ్రీసూర్యసాయి మణికంఠ 17 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లు గిరిధారి 3, హరిహరణ్ 3 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు మ్యాచ్ ముగిసింది.

కేఓఆర్‌ఎం మైదానంలో..

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో తూర్పుగోదావరి, ప్రకాశం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన తూర్పుగోదావరి జట్టు బ్యాటింగ్‌కు దిగి 41.2 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 112 పరుగులు చేసింది. జట్టులోని రేవంత్ 32 పరుగులు, రాజ్ ఆర్యన్ 22 పరుగులు చేశారు. ప్రకాశం బౌలర్లు లోకేష్ 2, ఉదయ్ నాయుడు 2 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.



తలపడుతున్న కర్నూలు, పశ్చిమగోదావరి జట్లు

జిల్లా యోగా జట్లు ఎంపిక

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి యోగా జట్ల ఎంపికలకు చక్కటి స్పందన లభించింది. శనివారం నిర్వహించిన అండర్-14, అండర్-17 బాలబాలికల ఎంపికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పతకాలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో యోగా నిపుణులు డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి, పెంచలయ్య, ఫిజికల్ డైరెక్టర్లు బాబు, సుశీలమ్మ, ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అండర్-14 బాలికలు : కె. మనస్విని, వై.నాగసిరి, కె.నందిని, టి.తేజశ్రీ, డి.శస్మి, ఎం.నాగవైష్ణవి, ఎల్.సుమతి, యు.హెచ్.రాణి, డి.దీపిక, వి.రిషిత.

అండర్-14 బాలురు : వై.క్రాంతిరెడ్డి, ఎస్.ప్రణీత్, బి. బన్నీ, పి.మహీధర్, కె.చంద్ర ఓబుళరెడ్డి, కె.ఆకాష్, వై.భరత్, ఎ. అశోక్, ఎం. లోహిత్ రంజన్, ఆర్.నాగసిద్ధార్థ.

అండర్-17 బాలికలు : ఎస్. సన్నీ, ఎస్.సోనీ, సి.ప్రవల్లిక, వైష్ణవి, బి.అనూరాధ, ఎస్.కె.రసూల్‌బీ, ఎస్.పావని, కె.అనిత, సి.కావ్య, వై.భవ్య.

అండర్-17 బాలురు : ఎస్.సాయిధనుంజయరెడ్డి, శ్రీమన్నారాయణ, పి.రత్నాకర్, ఎం.వినోద్‌కుమార్, కె.జయప్రకాష్, ఎం.జగదీష్, బి. శ్రీకర్‌తేజ, అభిషేక్, సుశాంత్, సాత్విక్.

కురబలకోట హత్య కేసులో పురోగతి

- విభిన్న కోణాల్లో ముమ్మర దర్యాప్తు
- నిందితుల గుర్తింపు
- మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు



కురబలకోట ఖాదర్‌బాషా (ఫైల్)

కురబలకోట : జిల్లాలో సంచలనం సృష్టించిన కురబలకోట హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. కురబలకోటకు చెందిన చింతపండు వ్యాపారి ఖాదర్‌బాషా (26)ను ఊరికి సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద శుక్రవారం రాత్రి గొంతు కోసి దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. శనివారం మృత దేహానికి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అంతకు ముందు క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. హత్యకు సంబంధించిన ఆధారాలను సేకరించారు. ఖాదర్‌బాషా అవివాహితుడు. వివాహేతర సంబంధం కారణమై ఉండవచ్చని తొలుత భావించారు. అయితే ఇతను భార్యాభర్తల మధ్య అడ్డుగా ఉన్నాడని ఆపై ఆస్తి కోసం కుటుంబంలో తలెత్తిన మనస్పర్థలు కూడా ఈ హత్యకు దారితీయించినట్లు మరో కోణంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హత్య కేసుకు సంబంధించి ఇప్పటికే గంటల వ్యవధిలోనే పోలీసులు నిందితులను గుర్తించారు. ఈ కేసును పోలీసులు చాలెంజ్‌గా తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. విభిన్న కోణాల్లో వేగవంతంగా దర్యాప్తు చేపట్టారు. స్థానికంగా తెలిసిన వారే శుక్రవారం రాత్రి ఖాదర్ బాషా ఇంటికి వెళ్లారు. మాట్లాడాలని నమ్మించి పిలుచుకు వచ్చి ఊరి బయట ఉన్న డంపింగ్ యార్డు వద్ద మరి కొందరి సహకారంతో దారుణంగా హతమార్చినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ముందస్తు పథకం ప్రకారమే ఈ హత్య చేసినట్లు తెలుస్తోంది. ఖాదర్‌బాషాను ఇదివరకే ప్రత్యర్థులు హెచ్చరించినట్లు తెలుస్తోంది. ప్రాణాపాయం పొంచి ఉందని కుట్రలు జరుగుతున్నాయని..జాగ్రత్తగా ఉండాలని బంధుమిత్రులు కూడా ఖాదర్‌బాషాకు సూచించినట్లు సమాచారం. ఈలోపే అన్నంత పని జరిగిపోయింది.ఈ హత్యతో ప్రశాంతంగా ఉండే కురబలకోట ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మృతుని తండ్రి బాబాఫక్రుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ కొండయ్య నాయుడు, రూరల్ సర్కిల్ సీఐ రమేష్ తెలిపారు. ఈ కేసులో వేగంగా పురోగతి సాధించినట్లు తెలిపారు. రెండు రోజుల్లోగా నిందితుల అరెస్టు చూపే అవకాశం ఉందని తెలిపారు.

చోరీ జరిగిన మూడు నెలలకు

నగలు, నగదు ప్రత్యక్షం



స్వామివారి నుంచి నగలు, నగదును అందుకుంటున్న అజయ్‌కుమార్ దంపతులు

చౌడేపల్లె : అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం చెరుకువారిపల్లెలో ఓ ఇంట్లో మూడు నెలల క్రితం చోరీ జరిగింది. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఆ ఇంటి ఆవరణంలో నగలు, నగదు ప్రత్యక్షమయ్యాయి. సత్య ప్రమాణాలకు నిలయమైన చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలంలోని రాజనాలబండ ప్రసన్నాంజనేయ స్వామి మహిమతోనే చోరీ అయిన 62 గ్రాముల బంగారు నగలు, నగదు తిరిగి లభ్యమయ్యాయని బాధితుడు సి.అజయ్ బాబు దంపతులు తెలిపారు. శనివారం రాజనాల బండకు చేరుకుని స్వామివారి పాదాల చెంత నగలు, నగదును పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. వారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం చెరుకువారిపల్లెకు చెందిన సి.అజయ్‌బాబు ఇంట్లో గత మూడు నెలల క్రితం చోరీ జరిగింది. బీరువాలోని నగలు 62 గ్రాములు, నగదు రూ.25 వేలు నగదు చోరీ అయ్యాయి. గుర్తించిన అజయ్‌బాబు ఇంట్లో వారిని, చుట్టుపక్కల వారిని విచారించారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. పెద్దమనుషులతో పంచాయితీ నిర్వహించి రాజనాల బండలో ప్రమాణం చేయాలని తీర్మానించారు. గత శనివారం రాజనాలబండకు చేరుకుని ముందుగానే ఈ నెల19 వతేదీ శనివారం ప్రమాణం చేయడానికి కావాల్సిన ఏర్పాట్లు పూర్తిచేసి వారి గ్రామానికి వెళ్లి విషయాన్ని గ్రామ పెద్దలకు వివరించారు. శనివారం ఉదయం ఇంటికొక మనిషి రాజనాల బండకు ప్రమాణం చేయడానికి బయలుదేరాల్సి ఉండగా ఇంటి ఆవరణలో నగలు, నగదు ప్రత్యక్షమయ్యాయి. గుర్తించిన బాధితులు పెద్దమనుషులకు నగల విషయాన్ని తెలిపి కుటుంబ సభ్యులతో ఆలయం వద్దకు చేరుకుని పూజలు చేశారు. స్వామి మహిమతోనే పోయిన నగలు తిరిగి వచ్చాయని సంతోషం వ్యక్తం చేశారు.

అమర వీరుల వారోత్సవాలను

విజయవంతం చేయండి

జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



రాయచోటి : ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు పోలీసు అమరవీరుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సిద్ధం కావాలని అన్నమయ్య జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశించారు. ఈ మేరకు శనివారం పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. ఏటా అమరులైన పోలీసులను స్మరించుకుంటూ వారి సేవలను కొనియాడుతూ ఈ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలు ఇలా ఉన్నాయి..

- 21న అమరవీరుల సంస్మరణ దినం.. స్మృతి పరేడ్ పోలీసు అమరులకు నివాళులు.. శ్రద్ధాంజలి
- అదే రోజున స్థానిక పోలీసు అమరవీరుల స్థూపం వద్ద జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించనున్నారు.
- దేశవ్యాప్తంగా.. మావోయిస్టులు, ఉగ్రవాదులు, తదితర అసాంఘిక శక్తులతో పోరాడి ప్రాణాలు అర్పించిన పోలీసు సిబ్బందిని స్మరించుకుంటూ నివాళులు అర్పించనున్నారు. స్మృతి పరేడ్ నిర్వహించి అమరులకు శ్రద్ధాంజలి ఘటించనున్నారు.
- 22 నుంచి 30వ తేదీ వరకు పోలీసు అమరుల గ్రామాల సందర్శన.. చర్చా వేదికలు, వక్తృత్వపు పోటీలు, 26న చిత్రాల ప్రదర్శనలు, జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌తో పాటు సబ్ డివిజన్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ల స్థాయిలో ఓపెన్ హౌస్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోలీసుల దర్యాప్తుల్లో కీలక భూమిక పోషించే డాగ్స్ బృందం విన్యాసాలు ప్రదర్శించనున్నారు. 28వ తేదీన వైద్య శిబిరాలు, రక్తదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 29న పోలీసుల త్యాగాలపై సెమినార్లు, ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. 31వ తేదీన ఉదయం యూనిటీ రన్, సాయంత్రం క్యాండిల్ ర్యాలీతో పోలీసు అమరవీరుల వారోత్సవాలు ముగుస్తాయని ఎస్పీ ప్రకటనలో వివరించారు.